ప్రజాశక్తి
మంగళవారం 7 జనవరి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# మార్మోగిన ఉక్కు నినాదం

◆ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని కార్మికులు భారీ బైకు ర్యాలీ ◆ కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కార్మికులు

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన కార్మికులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఉక్కునగరం విలేకరులు**

విశాఖ నగరమంతటా సోమవారం ఉక్కు పరిరక్షణ నినాదాలు హోరెత్తాయి. ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుంటున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలన్న డిమాండ్ అందరి నోటా వినిపించింది. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. తొలుత కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి గాజువాక, ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం మీదుగా భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బీచ్ రోడ్డులో వాహనాలను విడిచిపెట్టి అక్కడ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు కలెక్టరేట్ ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. దీంతో నిరసనకారులంతా రోడ్డుపై బైఠాయించి మండుటెండలో నిరసన తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్, ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నాయకులు యు.రామస్వామి, మిగతా 2లో..

## 'ఉక్కు'పై మోడీ స్పందించాలి

### నేడు, రేపు నిరసనలకు జెఎసి పిలుపు

అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

**విశాఖ కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు, సొంత గనులు కేటాయిస్తున్నట్టు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులూ కేటాయిస్తున్నట్లు ప్రధాని మోడీ విశాఖ పర్యటనలో స్పష్టంగా ప్రకటించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. జెఎసి సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు భోగవిల్లి నాగభూషణం, ఎం.మన్మథరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.మణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మిగతా 2లో..

## జిల్లాలో ఓటర్లు 12.91 లక్షలు

### - మహిళలే అధికం

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

సోమవారం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో 12,91,044 మంది ఓటర్లు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటర్ల తుది జాబితాను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ ప్రదర్శించారు. జిల్లాలోని చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని 1529 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం ఓటర్లు 12,91,044 మందికి చేరారు. వీరిలో పురుషులు 6,27,984 మంది, మహిళలు 6,63,032 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 28 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా వున్నారు. 2024 అక్టోబర్ 29న విడుదల చేసిన ముసాయిదా తరువాత కొత్తగా 3,044 మంది ఓటర్లు నమోదుకాగా, చనిపోయిన, వలస వెళ్లిన 1870 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. గతేడాది అక్టోబర్ 29న విడుదల చేసిన ముసాయిదా జాబితా నాటికి జిల్లాలో 12,89,870 మంది ఓటర్లుండగా సోమవారం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 12,91,044కు పెరిగారు. గత ముసాయిదా నాటికి 18-19 మధ్య వయస్సు కలిగిన యువ ఓటర్లు 16,016 మంది నమోదుకాగా, తుది జాబితా నాటికి 17,225 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 3,987 మంది ఉన్నారు.

నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి
▶ వార్త 5లో..

బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటే.. వద్దు.!
▶ వార్త 8లో..

ఓవరాల్ ఛాంపియన్‌గా మహిళా పాలిటెక్నిక్ కళాశాల
▶ వార్త 3లో..

## ప్రధాని పర్యటనపై వరుస సమీక్షలు

సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈ నెల 8న ప్రధాని మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లుపై నగరంలో సోమవారం వరుస సమీక్షలు సాగాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహచర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విశాఖ సర్క్యూట్ హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలన్నారు. ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటిచెప్పాలన్నారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలను మోడీ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రధాని పర్యటన రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం.రమేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**విఎంఆర్‌డిఎ కార్యాలయంలో..**

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. సోమవారం సాయంత్రం మిగతా 2లో..

## రైల్వే జోన్‌కు జెండా ఊపుతారా ?

◆ డివిజన్ ఉంచుతారా?
◆ వాల్తేరు రైల్వేలో గత ప్రాజెక్టుల అమలుకే అతీగతి లేదు
◆ 8న ప్రధాని మోడీ పర్యటనపై సర్వత్రా ఆసక్తి

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరాక తొలిసారి విశాఖకు ప్రధాని మోడీ ఈ నెల 8న వస్తుండడంతో అందరి చూపులు అటే ఉన్నాయి. ప్రధాని ఆ రోజు ఆంధ్రా యూనివర్శిటీ వేదికగా పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అయితే, మోడీ రాకతో రైల్వే జోన్‌పై హడావుడి ఎప్పటిలాగానే కొనసాగుతోంది. బిజెపి, టిడిపి, జనసేనలు రైల్వే జోన్‌ను మోడీ ప్రకటిస్తారంటూ ప్రచారం సాగిస్తున్నాయి. జోన్‌పై కూటమి సందడి చేస్తున్నా జోన్ కార్యాలయ భవన స్థలం ముడసర్లోవనా ? వైర్‌లెస్ కాలనీయా ? అన్నది ఇంతవరకూ తేల్చలేకపోతున్నారు. రైల్వే అధికారులు మాత్రం తమకు రైల్వేజోన్ శంకుస్థాపన సమాచారం ఇప్పటికీ లేదని అంటున్నారు. కొత్త జోన్ ప్రారంభిస్తారా ? వాల్తేరు రైల్వే డివిజన్ ఉంటుందని చెబుతారా ? లేదా ? అన్నది అనుమానమేనని వారంటున్నారు.

**గత ప్రాజెక్టుల అమలు తీరు ఇలా...**

2019 ఎన్నికల తర్వాత విశాఖలో ప్రధాని మోడీ పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసినా అవి ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు కదల్లేదు. వాటిలో రూ.456 కోట్లతో తలపెట్టిన రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఒకటి. వడ్లపూడి గేట్ జంక్షన్ కేబిన్, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, దువ్వాడ, సింహాచలం ఉత్తరం వద్ద రైల్వే పై ఓవర్ల నిర్మాణానికి రూ.800 కోట్ల ప్రాజెక్టు ప్రతిపాదనలకు రైల్వే బోర్డు ఆమోదం లభించినా ఈ పనులేవీ నేటికీ ప్రారంభం కాలేదు. విశాఖ రైల్వే స్టేషన్ వైపు రద్దీ తగ్గేందుకు సింహాచలం క్రాసింగ్ వద్ద పై నుంచి వెళ్లే వాటి కోసం ఆర్‌ఒబికి నాడు మోడీ శంకుస్థాపన చేశారు. ఇది కూడా పూర్తికాలేదు. పై ప్రాజెక్టులేవీ అమలు కానందున ముఖ్యమైన రైళ్లు అన్నీ విశాఖ స్టేషన్ వైపు కాకుండా దువ్వాడ మీద నుంచి వెళ్లిపోతున్నాయి. ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులే ఇలాగైతే ఎలా ? అంటూ ఈ ప్రాంత జనం పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం రాయగడ డివిజన్ కార్యాలయానికి వర్చువల్ విధానంలో ప్రధాని శంకుస్థాపన చేసిన నేపథ్యంలో వాల్తేరు రైల్వే డిఆర్‌ఎం కార్యాలయ అధికారులంతా రాయగడకు తరలి వెళ్లారు. దీంతో ఇక్కడి డిఆర్‌ఎం కార్యాలయం బోసిపోయింది. సుమారు రూ.1000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు మోడీ సోమవారం అంకురార్పణ చేసిన నేపథ్యంలో విశాఖ ప్రాజెక్టులపై ఈ నెల 8న ఏం ప్రకటిస్తారో వేచి చూడాల్సిందే.

మొదటి పేజీ తరువాయి..

## ప్రధాని పర్యటనపై వరుస సమీక్షలు

వివిఎంఆర్‌డిఎ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ బహిరంగ సభలో పాల్గొనే ముందు జరిగే రోడ్ షోకు పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్‌ను తరలించేలా నాయకులు సమాయత్తం కావాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, డి.రామారావు, వివిఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించారు.

## మార్మోగిన ఉక్కు నినాదం

వైటి.దాస్, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, కె.దాలినాయుడు, దొమ్మేటి అప్పారావు, సిఐటియు నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను తెలియజేశారు. అనంతరం జెసి మయూర్ అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు.

## 'ఉక్కు'పై మోడీ స్పందించాలి

ప్రధాన కార్యదర్శి యు.రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి తదితరులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారుగానీ కేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం లేదన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడవనివ్వడం లేదన్నారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నట్టేటముంచుతూ పక్కనున్న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. విశాఖపట్నం, రాష్ట్ర ప్రయోజనాలకు పూర్తి విరుద్ధంగా ముఖ్యమంత్రి చర్యలు ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలోని అన్ని కార్మిక కేంద్రాలు, పరిశ్రమల వద్ద నిరసనలు చేపట్టాలని, బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 8న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జెఎసి సమావేశం నిర్ణయించింది. ఆయా కార్యక్రమాల్లో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసింది. సమావేశంలో జెఎసి భాగస్వామ్య సంఘాల నాయకులు టి.నూకరాజు, కె.కుమారి, అగస్టీన్, జి.అజయ్, పి.సాయితేజ, జి.పల్లవి పాల్గొన్నారు.

## ఉక్కుపై మాట్లాడేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలి

**- ముఖ్యమంత్రికి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ**

ఈ నెల 8న ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఆయనతో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడేందుకు సిఎం చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు సోమవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా, సెయిల్‌లో ప్లాంట్‌ను విలీనం చేసేలా ప్రధానిపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజలకిచ్చిన వాగ్దానం ఆచరణలోకి రాలేదన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని ప్రకటించాలి : సిఐటియు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని ప్రధాని మోడీ ప్రకటించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కుపై తాజా పరిణామాలను వివరించారు. విశాఖ ఉక్కు రక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికవర్గం పోరాడుతోందన్నారు.

మాట్లాడుతున్న కుమార్

## 'ఆ ప్రాజెక్టులన్నీ మేం తెచ్చినవే'

మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ ఈ నెల 8న విశాఖపట్నంలో భూమి పూజ చేస్తున్న, ప్రారంభిస్తున్న ప్రాజెక్టులన్నీ గత ప్రభుత్వంలో సిఎం వైఎస్.జగన్ చొరవతో సాధించినవేనని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. సోమవారం ఉదయం మద్దిలపాలెం సమీపంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందిందన్న ఆయన ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేష్ ఈ ప్రాంతంపై అవగాహనా రాహిత్యంతో అర్థం లేకుండా మాట్లాడారన్నారు. ఇప్పటికీ తన శాఖపై పట్టు సాధించలేకపోయిన లోకేష్ గత వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రధాని మోడీతో నిర్దిష్ట ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

# సెవెన్ హిల్స్ కార్మికుల ఆకలి యాత్ర

మానవహారం చేపట్టిన కార్మికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులకు బకాయి ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, సోమవారం విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ ఆసుపత్రి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఆకలి యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాజు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, ముఠా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బారావు తదితరులు నాయకత్వం వహించారు. గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# 10న విశాఖకు షర్మిల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఈ నెల 10న విశాఖకు వస్తున్నారని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ప్రియాంక దండి తెలిపారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆ రోజు షర్మిల స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు జై భీమ్, జై భారత్, జై కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న శాంతియుత కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

**IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI**
**A.S.No.916 OF 2008**

Between:
యర్రంశెట్టి సత్యనారాయణ
...Petitioner/Appellant
And
1. కోలవెన్ను బాలవరప్రసాద రావు (Died)
2. దరిసి శైలా రాణి (Died)
To
**R-8.** దరిసి ప్రశాంత్, S/o. దరిసి బాల భాస్కర రావు
**R-9.** దరిసి ప్రియాంక, D/o దరిసి బాలభాస్కర రావు
**R-10.** దరిసి ప్రత్యూష, D/o దరిసి బాల భాస్కర రావు
All of you are R/o. Flat No. 102, Plot No.18, Jayadeep Apartments, Behind Municipal Gate, Kirlampudi layout, Visakhapatnam.

పై నంబరు అప్పీల్ నందు R-2 దరిసి శైలారాణి చనిపోయినందున మిమ్ములను వారి వారసులుగా అనగా రెస్పాండెంట్ No. 8,9 మరియు 10 గా పై కేసులో చేర్చుటకు I.A.No.1,2 మరియు 3 of 2021 దాఖలు చేయగా మీకు నోటీసు నిమిత్తం ది. 22-01-2025 న హైకోర్టులో వాయిదా అయి ఉన్నది. ఆ రోజు ఉదయం 10.30 మీరు ప్రత్యక్షం గా కానీ, మీ లాయరుగారి ద్వారా గాని హాజరై మీ తరుపు ఆక్షేపణలు తెలియపరచవలెను. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం.
పి.ప్రభాకర్‌రావు,
న్యాయవాది.
హైకోర్టు, అమరావతి

**KANAKADURGA FINANCE LIMITED**
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విశాఖపట్నం బ్రాంచి ఆఫీసులు -
NAD కొత్తరోడ్, Opp.భాష్యం స్కూల్ రోడ్డు, గోపాలపట్నం.
-లలిత ప్లాజా, ఫస్ట్‌ఫ్లోర్, బోయ్‌లండన్ షాప్ వెనుక, ద్వారకానగర్.
-జన కాలనీ, బాలాజీనగర్, దుర్గమ్మ గుడిదగ్గర, అరిలోవ.
-హెరిటేజ్ సూపర్‌మార్కెట్ ఎదురు, అనకాపల్లి రోడ్డు, సబ్బవరం
-1st ఫ్లోర్, సీతారామనగర్, జన రోడ్, న్యూగాజువాక.

**బంగారు వేలం ప్రకటన**

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గంటలకు మా బ్రాంచి ఆఫీసు నందు 1754.49 గ్రాముల వస్తువులు కుదువపెట్టిన పాత బంగారం నగలు #48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, నందు వేలం వేయబడును. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

అధరైజ్ ఆఫీసర్
KANAKADURGA FINANCE LIMITED
#48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, PIN–530018, CONTACT PERSON, AREA MANAGER, NAGESH-89192-39576

**డాక్యుమెంట్ పోయినది**

నేను కొల్లూరు నెరజారాణి
W/o. ప్రతాప్ కుమార్
ఇంటి నెంబర్ 65-5-103, ఉడా కాలనీ, శ్రీహరిపురం, మల్కాపురం, విశాఖపట్నం 530011 నందు నివసిస్తున్నాను. నేను 6-12-2024 న నా ఇంటి ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్, ఉడా కాలనీ, ఫ్లాట్ నెంబర్ MIG-1/103, రిఫరెన్స్ నెంబర్ 571/1992 తో సింధియా నుండి శ్రీహరిపురం ఆటోలో వెళ్తుండగా పడిపోయింది.
దొరికిన యెడల ఈ క్రింది నెంబర్కు తెలియజేయగలరు.
**సెల్: 87127 23818**

**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి పాతపట్నం వారి కోర్టులో**
**O.S. No. 6/2024**

Between:-
సంపతిరావు మోహిని .....వాది
And:
పైల ప్రతాప్ .....ప్రతివాది

**ప్రతివాదికి నోటీసు:**

ప్రతివాది అయిన పైల ప్రతాప్, S/o పైల లచ్చయ్య, వయసు 33 సం॥లు, వ్యాపారం, R/o డోర్ నెం. 23-9-9, సింహగిరి కాలనీ, న్యూ గాజువాక, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్, అనే ఆసామీ వారు పై నెంబరు దావాలో తేది **24-01-2025 న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై పైదావాలో మీ ఆక్షేపనలు కోర్టులో తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
**(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)**

**బి.ఇ. సత్యనారాయణ**
**వాది తరపు న్యాయవాది,**
**పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా.**
**ఫోన్: 9441121146.**

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : PENUKONDA.**
**O.S.66/2017**

Between:
Chadraiah and others ...Plaintiffs
And
Anjinappa and Others ...Defendants

**NOTICE TO THE DEFENDANTS NO.15 and 17**

To.
**D15.**Meera Meri Varghese, D/o.D.Ramesh, S/o.Anjinappa, Block-9, G-4, Visweswaraiah Nagar, Srinagar Colony, Vishakapatnam, Pedagantyada, BHPV, Vishakhapatnam City.
**D17**.A.Kiranmaya Sharma, S/o.A.Leela Suka Sharma, D.No.2-177, Kakani Village, Narasaraopeta Mandal, Guntur District.

వాదులు మీ పైన భాగపరిష్కారం కొరకు పై దావా కోర్టు నందు వేసినారు. అందులో మిమ్ములను క్రింద ప్రతివాదులుగా చేర్పు ఆర్డీలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీకు చేరి ఉండలేదు. కావున ఈ ప్రకటన చూసిన అనంతరం పైకోర్టు నందు **20-1-2025**వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని పైకోర్టు నందు హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానిచో మీ పరోక్షము నందు దావా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
**వాయిదా తేది :20-1-2025**
//By Order of the Court//
**సి.ఆర్.నాగార్జున**, ఎం.ఏ.ఎం.ఎల్.,
అడ్వకేట్, పెనుకొండ,
సెల్: 9492584259.

**IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE CUM S.C. & S.T. COURT AT SRIKAKULAM.**
**O.S. 73/2016.**

Between :-
**Smt. Chakkuri Maharatnam,** W/o Ch. Apparao,Residing at D.No. 23-78/4, East point Colony, Srinivasa Nagar, Simhachalam, Visakhapatnam.
.....Plaintiff
And :-
**D-11: Chaduvula Raja kennady,** S/o. venkata Rao, Hindu, residing at D.No: 5-18, Old Dairy Park, Vivekananda Nagar, Visakhapatnam town and District.
**D-15: Vaddipalli Kanaka Raju,** S/o. late Kasi, Hindu, Residing at Telaga Veedhi, Rajam Nagar panchayat, Man, Srikakulam District.
**D-18: Sreeram Surya Rao,** S/o. late Poturaju, Hindu, residing at Telaga Veedhi, Rajam(Nagar Panchayat) Mandal, Srikakulam District.
**D-32: Laveti Satyam Naidu,** S/o. late Surapu Naidu, residing at Saaradhi Village, Rajam Nagarapanchayat) Mandal, Srikakulam District.
**D-36: Bondada Visali,** W/o. Mohan Rao, Koraganji vaari veedhi, Rajam Mandal, Srikakulam District.
**D-37: Rangumudri Siva Narendra Naidu,** S/o. Ganapathi Rao, Rangumudri, Educational Society, Chilakalapalli Vill, Balizipeta Mandal, Vijayanagaram District.
.....Defendants

పై నెంబరు OS.73/2016 దావాలోగల వాదులు పైన పేర్కొన్న ప్రతివాదులుపై Partition దావా దాఖలు చేయగా, సదరు OS.73/2016 నెంబరు దావా తే **31-01-2025దిన పైకోర్టులో వాయిదా అయివున్నది.** ఆదినమున పై కోర్టులో ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గాని, లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలయును. లేని ఎడల సదరు దావా OS.73/2016ను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
**(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)**
**ఎం.వి. కామేశ్వరరావు, న్యాయవాది,**
**శ్రీకాకుళం, సెల్: 9441568879.**

# క్షీణించిన పారిశుద్ధ్యం..

- ఎక్కడికక్కడే చెత్త కుప్పలు
- అరకొరగా పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సంతపేటకు వెళ్ళే మార్గంలో ప్రైవేట్ స్కూల్ మీదుగా జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే కూడలి వద్ద, గాంధీ బొమ్మ వెనుక వీధిలో చెత్త కుప్పలుగా పడి ఉన్నాయి. దీంతో అటుగా వెళ్లే స్థానికులు ముక్కు మూసుకుంటున్నారు. సోమవారం నాటి పరిస్థితి ఇలా ఉంది.

**అరకొరగా పారిశుధ్య కార్మికులు..**

పెరుగుతున్న జనాభాకు తగిన మేరకు పారిశుధ్య కార్మికులు ఇక్కడ లేరు. దీంతో ఉన్న కొద్ది మందిపైనే పని భారం పెరుగుతోంది. దీంతో అనివార్యంగా పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేసే పరిస్థితి లేదు. ఫలితంగా చెత్త కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు అందుకనుగుణంగా అదనంగా పర్మినెంట్ పద్ధతిలో పారిశుధ్య కార్మికుల నియామకం చేపట్టాల్సివుంది.

జివిఎంసి ఒకటో జోన్ పరిధి చాలా విస్తరించి ఉంది. జివిఎంసి 4వ వార్డు పరిధిలో గల 5 విలీన పంచాయతీలు మొదలు కొని బీచ్ రోడ్డు, 3వ వార్డు శివారు ప్రాంతాలైన కృష్ణా కాలనీ, 2వ వార్డు శివారు ప్రాంతాలైన సంగివలస, నమ్మివానిపేట, అల్లూరి సీతారామరాజు కాలనీ, 1వ వార్డు బాలాజీ నగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలతో విస్తరించి ఉన్న ఒకటో జోన్‌లో పూర్తి స్థాయిలో పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారులకు పక్కనే చెత్త కుప్పలుగా పడి ఉన్నాయంటే సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే చెప్పాలి.

గాంధీ బొమ్మ కూడలి వద్ద కుప్పగా పోగు పడిన చెత్త

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో జింక మృతి

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై బోరవానిపాలెం సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదంలో జింక మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం... బోరవానిపాలెం సమీపంలో డ్రైవర్స్ కాలనీ వద్ద జింక రోడ్డు దాటుతోండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతిచెందింది. ఫారెస్ట్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

## ఓవరాల్ ఛాంపియన్‌గా మహిళా పాలిటెక్నిక్ కళాశాల

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఈ నెల 2,3,4 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ సోమవారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో వరుసగా మూడో సారి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను గెలుచుకొని హ్యాట్రిక్ సాధించారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో విద్యార్థులకు ఇన్‌ఛార్జి ఫిజికల్ డైరెక్టర్ పాజం శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జి ఫిజికల్ డైరెక్టర్, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

## రమణికి అభినందనలు

ప్రజాశక్తి -తగరపువలస : తమిళనాడులో జనవరి రెండో వారంలో జరిగే అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో ఆంధ్రా యూనివర్సిటీ తరపున ఆడేందుకు తమ కళాశాలకు చెందిన బికాం మొదటి ఏడాది విద్యార్థిని పి.రమణి ఎంపికైనట్లు స్థానిక శ్రీ బాసర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.సురేష్ తెలిపారు. ఆమెను కళాశాల చైర్మన్ పూడి రమేష్ అభినందించారు

## ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కూరకుల వెంకటేశ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అభయాంజనేయ ఆలయాభివృద్ధికి రూ.30 వేలు విరాళంగా అందజేశారు. స్థానిక కింగ్స్ ఫంక్షన్ హాల్లో కీర్తిశేషులు కూరాకుల సంజీవరావు, అప్పలకొండమ్మ దంపతుల జ్ఞాపకార్థం పంచాయతీ పరిధిలో ప్రస్తుత, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురిని ముఖ్య అతిథులుగా హాజరై ప్రముఖ వైద్యులు బి.కృష్ణారావు, ధనలక్ష్మి సొసైటీ డైరెక్టర్ వై.అజయ్‌శేఖర్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఎం.గోవిందరావు. కింగ్ ఫ్యూయల్ అధినేత ఎన్.రేవంత్ కుమార్ రాజు, శ్రీరాం ఫైనాన్స్ జిఎం కూరాకుల వాసులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేష్ మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ట్రస్టును ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు చేపట్టడానికి నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని అభయాంజనేయ ఆలయాభివృద్ధికి రూ.30 వేలును ఆలయ నిర్మాణ ధర్మకర్త బావిశెట్టి ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కోరాడ వెంకటరావు, మాజీ సర్పంచ్ మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు, సర్పంచ్ బావిశెట్టి రాజు, వితరణ సంఘం జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకటప్పారావు, గుండు నానాజీ, కూరాకుల మురళి, కూరాకుల ఈశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు స్వీయ రక్షణ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెసిఐ విశాఖ నైట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన పాఠశాల విద్యార్థినులకు సోమవారం స్వీయ రక్షణపై శిక్షణా తరగతులను నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థినులు హాజరయ్యారు. విద్యార్థినులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడంలో మెళకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా జెసిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయి లక్ష్మి మాట్లాడుతూ, కరాటే, కుంగ్‌ఫు వంటివి స్వీయ రక్షణలో భాగమన్నారు. తెలియని వ్యక్తులతో చనువుగా ఉండరాదని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించినట్లు తెలిపారు. విద్యార్థి దశలో కేవలం చదువు, క్రీడల మీద మాత్రమే దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మాజీ ఆర్మీ ఉద్యోగి, పీటీ ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులుగా వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించడానికి జెసిఐ హెచ్‌జిఎఫ్.కిరణ్ పోలిపల్లి, జెఎఫ్ఎం సంతోష్ నెమ్మాని, ఆదిత్య సాయి అన్నెపు, జెఎఫ్ఎం కాశిక తదితరులు సహకారం అందించినట్లు వివరించారు.

## కంటి కేన్సర్‌కు అత్యాధునిక ప్రక్రియ ప్లాక్ బ్రాకీథెరపీ

డాక్టర్ అనసూవ గంగూలి కపూర్

ప్రజాశక్తి - ఆరిలోవ : కంటి కేన్సర్‌కు ప్లాక్ బ్రాకీథెరపీ అత్యాధునిక ప్రక్రియ అని, దీనిని ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ అనసూవ గంగూలి కపూర్ తెలిపారు. ప్లాక్ బ్రాకీ థెరపీ కొరాయిడల్ మెలనోమా, కొరాయిడల్ హెమన్జియోమా, రెటినల్ వాస్కులర్ ట్యూమర్లు ఇతర కంటి ఉపరితల ట్యూమర్ల వంటి ఇంట్రా ఆక్యులర్ ట్యూమర్లు కోసం ఉపయోగించే మొదటి శ్రేణి చికిత్సలు నిరుపయోగమైనప్పుడు రెటినోబ్లాస్టోమా రిఫ్రాక్టరీ కేసులలో దీనిని తరచూగా ఉపయోగిస్తారని వివరించారు. ఈ చికిత్సలో ట్యూమర్ అంచనా వేయడానికి, ప్లాక్ పెట్టడానికి ఒక ఆక్యులర్ ఆంకాలజిస్ట్, ప్లాక్ మోతాదు రూపొందించేందుకు రేడియేషన్ ఆంకాలజిస్ట్, రేడియేషన్ ఫిజీషియన్, ప్రక్రియ సమయంలో రోగి పర్యవేక్షణకు అనస్థీయన్, రేడియేషన్ సేఫ్టీ అధికారి, నర్సింగ్ సిబ్బంది తదితరులు అవసరమని పేర్కొన్నారు. ఇటువంటి సౌకర్యాలు కలిగిన ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో అందుబాటులో ఉన్నందున శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

# ఆక్వా రంగ సమస్యలపై పరిశోధనలు

### గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ

ప్రజాశక్తి -మధురవాడ : గీతంలో నీటి నాణ్యత, ప్రయోగశాలల ద్వారా ఆక్వా పరిశ్రమ రంగానికి నాణ్యత ప్రమాణాల విషయంలో సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ డివిజన్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. మూడు దశాబ్దాల్లో దేశంలోని ఆక్వా రంగం గణనీయంగా అభివృద్ధి చెందినా నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో ఇబ్బందుల కారణంగా నేడు సవాళ్లను ఎదుర్కొంటోందని, ముఖ్యంగా మితిమీరిన యాంటీ బయాటిక్‌ల వినియోగం, వ్యర్థాల శుద్ధి, నీటి నాణ్యతలో లోపాల వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆక్వా సాగు ఎంతో సున్నితమైనదని వాతావరణ మార్పులకు, చెరువులలో నీటి నాణ్యత, మందుల వాడకంలో జాగ్రత్తలు వహించకపోతే నష్టాలు ఎదురవుతాయన్నారు. ఎయు - అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎకె.రెడ్డి మాట్లాడుతూ, 1970లో ప్రారంభమైన ఆక్వా రంగం నేడు 2.21లక్షల హెక్టార్లకు విస్తరించిందని తెలిపారు. రొయ్య విత్తనాన్ని వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుని సాగు చేయడం వల్ల వివిధ సమస్యలు ఎదురయ్యాయని వివరించారు. ఆక్వా రంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా విజయం సాధించవచ్చన్నారు. ప్రభుత్వం తరపున నమూనా హేచరీలను అభివృద్ధి చేసి ఆక్వా రంగం బలోపేతానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎయు-అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణిప్రకాశ్ మాట్లాడుతూ, తమ సెంటర్‌లోని 5 ప్రయోగశాలల ద్వారా ఇప్పటి వరకు 650 మందికి శిక్షణ అందించామని తెలిపారు. అఖిలభారత ష్రింప్ అసోసియేషన్ కార్యదర్శి పి.వి.నాగేశ్వరరావు రొయ్యల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో గీతం జీవ శాస్త్రాల విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్, గీతం నిపుణులు ప్రొఫెసర్ అనీమా ఎస్.దధిచి, డాక్టర్ పి.షణ్ముఖానందం, డాక్టర్ పి.కిరణ్మయి పాల్గొని గీతం ప్రయోగ శాలల ద్వారా ఆక్వా రంగం పరిశోధనలకు గల అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగం పరిశ్రమల ప్రతినిధులు గీతంలోని మూర్తి ప్రయోగ శాలలను సందర్శించారు.

# గీతంలో ఫైజర్ బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సు

ప్రజాశక్తి -మధురవాడ : ఉత్తరాంధ్ర జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాలలో బాలికల అభ్యున్నతి కోసం ప్రపంచ ప్రఖ్యాత ఔషధ పరిశ్రమ ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి నిర్వహిస్తున్న బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సు 4వ బ్యాచ్ శిక్షణ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కోర్సులో ప్రవేశానికి బాలికలను వివిధ గ్రామాలకు వెళ్లి స్వయంగా ఎంపిక చేసుకుని ఉద్యోగంతో పాటు గీతం ద్వారా బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫైజర్ అటానమస్ టీమ్స్ (ప్యాట్) పేరిట బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ప్రవేశం పొందిన బాలికలకు ఉద్యోగంతో పాటు డిగ్రీ పూర్తి చేసేంతవరకు ఫైజర్ కంపెనీ సహాయం అందించనుంది. కాగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 4వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం సందర్భంగా ఫైజర్ విశాఖ అధిపతి మురళీధరశర్మ మాట్లాడుతూ, 175 సంవత్సరాల చరిత్ర గల ఫైజర్ సంస్థ ప్రపంచ ఫార్మా రంగంలో 5వ స్థానంలో ఉందని, కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ తయారీ ద్వారా ఎందరో ప్రజల ప్రాణాల కాపాడామని చెప్పారు. గీతంతో కలిసి నిర్వహిస్తున్న బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో ఇప్పటి వరకు 350 మంది గ్రామీణ బాలికలకు అవకాశం కల్పించామన్నారు. ఈ కోర్సులో ప్రవేశం పొందే ప్రతి ఒక్కరూ 10 సంవత్సరాలలో నాయకత్వ లక్షణాలతో బహుముఖ ప్రజ్ఞతో వ్యవహరించే విధంగా గీతంతో సంయుక్తంగా కలిసి కోర్సును రూపొందించామని తెలిపారు.

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, బాలికా విద్యకు ఫైజర్ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యత అభినందనీయమన్నారు. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్సులకు రూపకల్పన చేయడంలో గీతం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యాలయాలకు, పరిశ్రమలకు మధ్య ఏర్పడే సంబంధాలు నైపుణ్యం గల మానవ వనరులను దేశానికి అందించడంలో సహాయ పడతాయన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్‌వివిఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా తాము కోర్సులు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర పరిశోధన సంస్థల సహకారంతో రూ.1.23 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని వెల్లడించారు. గీతం ప్రొఫెసర్ల పర్యవేక్షణలో బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సును అభ్యసించడం విద్యార్థినులకు మంచి అవకాశం అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్, ఫైజర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫైజర్ కెమిస్ట్రీ కోర్సు ప్రారంభంలో గీతం ప్రతినిధులు

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, బి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.ఆపార్ట్‌మెంట్ ప్రక్కన విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

# సామర్థ్యం 950.. ఖైదీలు 2వేలు

- గంజాయి కేసులే ఎక్కువ
- కత్తిమీద సాములా మారిన పర్యవేక్షణ
- 200 మందిని వేరే జైలుకు పంపేందుకు సన్నాహాలు
- ఇదీ విశాఖ కేంద్రకారాగారంలో పరిస్థితి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారం ఖైదీలతో కిటకిటలాడుతోంది. సామర్థ్యానికి మించి ఖైదీలు ఉండడంతో వారికి మౌలిక వసతులు కల్పించడంలోనూ, వారిని పర్యవేక్షించడంలో జైలు అధికారులకు, వార్డర్లకు కత్తి మీద సాములా మారుతోంది. విశాఖ కేంద్రకారాగారం సామర్థ్యం సుమారు 950 మందికి మాత్రమే ఉంటుంది. ప్రస్తుతం 2 వేలకుపైగా ఖైదీలున్నారు. వీరిలో ఎక్కువగా రిమాండ్ ఖైదీలు ఉన్నారు. రిమాండ్ ఖైదీల్లో గంజాయి కేసుల్లో పట్టుబడ్డవారే అధికంగా ఉన్నారు. వివిధ కేసుల్లో నేరారోపణలు రుజువై శిక్ష అనుభవిస్తున్నవారు 440 మంది ఉన్నారు. మిగిలిన వారంతా రిమాండ్ ఖైదీలే. ఇటీవల ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపడంతో ఎక్కడికక్కడ తనిఖీలతో గంజాయి నిందితులు పట్టుబడుతున్నారు. వీరందరినీ కేంద్రకారాగారానికి తరలిస్తున్నారు. క్షమాభిక్షతో విడుదలయ్యే ఖైదీల జాబితాను గత మూడేళ్లుగా ప్రకటించడంలేదు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు 40 మంది వరకు ఉన్నారు. సామర్థ్యానికి మించిన ఖైదీలను నియంత్రించేందుకు సిబ్బంది కొరత వెంటాడుతుంది. సుమారు 150 మంది సిబ్బంది ఉండాల్సిన స్థానంలో 90 మంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడి నుంచి సుమారు 200 మందిని వేర్వేరు జైళ్లకు తాత్కాలిక ప్రాతిపదికన పంపించాలని జైళ్ల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇలా పంపిస్తే వారిని కోర్టులకు హాజరుపరచడం కూడా కష్టమవుతుందని మరో ఆలోచన కూడా ఉంది. ఖైదీలకు నిషేధిత వస్తువులను కొంత మంది జైలు సిబ్బంది విచ్చలవిడిగా అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశాఖపట్నం సెంట్రల్ జైలు

అంతర్జాతీయ సాంకేతిక దినోత్సవంలో పాల్గొన్న కళాశాల ప్రతినిధులు

## ఆదర్శలో అంతర్జాతీయ సాంకేతిక దినోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ టి.థియోఫిలస్ మాట్లాడుతూ, సాంకేతికత పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యత, సాంకేతిక విభాగంలో పురోగతులు, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, రోబోటిక్స్, కంప్యూటర్ సైన్సు తదితర సాంకేతిక రంగాల్లో కీలకసాధనలో ఆవిష్కరణలు- పరిణామాలపై పవర్ పాయింట్ ప్రదర్శనలను విద్యార్థులు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ఇ.ఫ్లోరా, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆఫీసర్లు మంజుల, డిఎస్.ప్రదీప్, సంధ్యారాణి, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు ఐశ్వర్య, నందిని, కుష్మిత, గ్రీన్‌షా, యాని జాయిసి, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డులో గెడ్డ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.19 లక్షలతో కూటమి నాయకులు శ్యామల దీపిక శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వర్కిఇన్‌స్పెక్టర్ ప్రభు పాల్గొన్నారు.

కూటమి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గణబాబు

## 'ప్రధాని మోడీ పర్యటనను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఈ నెల 8వ తేదీన వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను జయప్రదం చేయాలని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు కోరారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో కూటమి పార్టీల నాయకులు, జివిఎంసి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుధవారం జరిగే నరేంద్రమోడీ రోడ్ షో, బహిరంగ సభకు అంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎయు వీసీ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం పరిశీలించారు. సభా వేదిక, ప్రజలు కూర్చునే ప్రాంగణంలో జరుగుతున్న వేదికల నిర్మాణం తదితర అంశాలను ఆయన పరిశీలించారు. విశ్వవిద్యాలయం తరపున సమావేశం నిర్వహణకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు వీసీ తెలిపారు. ప్రధాని భద్రత ఏర్పాట్లకు సంబంధించి వస్తున్న పోలీసు సిబ్బందికి, అధికారులకు ఎయులోని పలు ప్రాంతాలలో వసతి సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎయు వీసీ

# గ్రాఫైట్ గ్యాలరీ ఆవిష్కరణ

గ్రాఫైట్ గ్యాలరీ ఆవిష్కరణలో మాట్లాడుతున్న ఎస్ఆర్ఎన్.రెడ్డి తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార: రామాటాకీస్ రోడ్ సెంటర్‌లోని ఎక్సెల్ వరల్డ్ పేరిట మొట్టమొదటి గ్రాఫైట్ గ్యాలరీని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఎక్సెల్ వరల్డ్ ప్రతినిధి ఎస్ఆర్ఎన్.రెడ్డి మాట్లాడుతూ, గ్రాఫైట్ టైల్స్ గ్లేజ్డ్ పాలిష్డ్, గ్లేజ్డ్ విట్రిఫైడ్ టైల్స్‌గా ఆరు వేలకుపైగా రకాలతో కోరుకున్న విధంగా ఫ్లోరింగ్‌ను తీర్చిదిద్దుతాయని వెల్లడించారు. ఎలాంటి అతుకులు లేని విధంగా అమర్చేందుకు వీలుగా ఉంటాయన్నారు. ఉపరితలం అభివృద్ధి కోసం కావలసిన ముడి పదార్థాలు, ఇంకులను స్పెయిన్ నుంచి కంపెనీ దిగుమతి చేసుకుంటుందని వెల్లడించారు. వినియోగదారులకు 6000కుపైగా అనుకూలమైన ఉత్పత్తులను ప్రదర్శనలో చూపించడమే ఈ గ్యాలరీ ఉద్దేశమని చెప్పారు. టైల్స్ తయారీ వివరణ ప్యానెల్, ఉపరితల పోలిక ప్యానెల్, సిరీస్ వారీ ప్యానెల్లు, ఉపరితలం కోసం ఉత్పత్తి ఆల్బమ్‌లు, వర్చువల్ ఫ్యాక్టరీ టూర్ వీడియో ప్రదర్శనలు, ఉత్పత్తి వారీగా 360 డిగ్రీ వర్చువల్ టూర్, కంపెనీ శిక్షణ పొందిన సలహాదారులు సూచనలు, సూర్యకాంతిలో క్లిక్ చేయబడిన ప్రతి ఒక్క టైల్ డిజైన్ ఫొటో, టైల్స్ ఉత్తమ అమరికకు నమూనా సూచనలు, టైల్స్ అమరిక తర్వాత ఫ్లోర్ ఎలా ఉంటుందో 3డి ప్రివ్యూ చిత్రం, ఉత్పత్తిని దగ్గరగా చూడటానికి అధిక రిజల్యూషన్ కలిగిన చిత్రాలు అన్నింటిని గ్యాలరీలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. బిల్డర్లు, సేకరణ ఏజెన్సీలు, ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డీలర్లు, వ్యాపారులకు గ్యాలరీ ఉపయోగపడుతుందని తెలిపారు. సమావేశంలో గ్రాఫైట్ సెరామిక్స్ ప్రతినిధులు రవి పటేల్, వీరల్ పటేల్ పాల్గొన్నారు.

## సినిమా టికెట్ల ధర పెంపు తగదు

ప్రజాశక్తి-మాధవధార : కొత్తగా విడుదలయ్యే సినిమాలకు టికెట్ల రేటు పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు వేసుకునేందుకు అనుమతిని ఇవ్వడం మంచిది కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఒబిసి డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి మూల వెంకటరావు పేర్కొన్నారు. డిమాండ్ అండ్ సప్లై ఆధారంగా రేట్లు పెంచుతున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పడం ఆయన హోదాకు తగదని పేర్కొన్నారు. ప్రజల అభిమానాన్ని బలహీనతగా చూస్తారా అని ప్రశ్నించారు. బెనిఫిట్ షో ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఏదో ఒక సామాజిక కార్యక్రమానికి ఉపయోగించాలి, కానీ దానికి విరుద్ధంగా ప్రేక్షకుల అభిమానాన్ని లాభంగా మలుచుకోవడం మంచిది కాదని పేర్కొన్నారు. అభిమానులకు ప్రత్యేకంగా చూపించాలనుకుంటే ఉచితంగా చూపించడం లేకుంటే టికెట్ల ధరపై రాయితీ ఇవ్వాలి తప్ప ధరలు పెంచడం అభిమానాన్ని దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు. హీరోల అభిమానులు నూటికి 90 శాతం మంది దిగువ, మధ్య తరగతికి చెందినవారే ఉంటారని, అటువంటి వారి నుంచి దోపిడీకి పాల్పడటం భావ్యం కాదని పేర్కొన్నారు.

# ప్రయివేటీకరణ ఆపేవరకూ పోరాడతాం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపే వరకు పోరాడుతామని విశాఖ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వి.ఎస్.పద్మనాభరాజు స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 98వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రయివేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని గుర్తుచేశారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం అన్యాయమని తెలిపారు. విశాఖ అభివృద్ధికి వైజాగ్ పోర్టు కీలకమని, ఏటా మున్సిపాలిటీకి సగటున రూ.65 కోట్లు పన్నులు కడుతున్న పోర్టును ప్రయివేటుకు ధారాదత్తం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని చెప్పారు. ఆసుపత్రి ప్రయివేటీకరణకు టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక వర్గ పోరాట ఫలితంగానే వాయిదా వేశారని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, శంకరరావు, కెఎస్.కుమార్, రాఘవులు, విజయకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు, నాయకులు

ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు

# నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి

## సిపిఎం నేతలు లోకనాథం, కోటేశ్వరరావు

**ప్రజాశక్తి-అచ్యుతాపురం**

అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద ప్రభుత్వ రంగంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు ఏర్పాటును సిపిఎం స్వాగతిస్తుందని, అయితే ఈ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులవుతున్న వారికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈనెల 8న ప్రధానమంత్రి మోడీ వర్చువల్‌గా ప్రారంభించనున్న ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్రాంతాన్ని సిపిఎం నేతలు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం, కోటేశ్వరరావు మాట్లాడుతూ నీరు, గాలి, సూర్యరశ్మి నుండి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారని, పూడిమడక గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి దేని ద్వారా తయారు చేస్తారో ప్రజలకు తెలియజేయాలని కోరారు. పూడిమడకలో 1200 ఎకరాల్లో ఎన్‌టిపిసి ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో నిర్వాసితులకు 75శాతం ఉపాధి కల్పనకు గ్యారెంటీ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక గ్రామ మత్స్యకారులు సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కాలుష్యకారక ఫార్మా, ఇతర పరిశ్రమలు పైపులైన్లు వేసి వ్యర్థాలు సముద్రంలో వదలడం వలన మత్స్య సంపద నాశనమై మత్స్యకారుల ఉపాధి దెబ్బతిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఎన్టిపిసి పేరుతో సముద్రం నీటిని ఉపయోగిస్తే మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతుందని, దీనిపై ప్రభుత్వం, ఎన్టీపీసీ యాజమాన్యం నిర్వాసితులు, మత్స్యకార గ్రామాల్లో ప్రజాభిప్రాయం చేపట్టి వారికి ఉపాధి భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కృష్ణారావు, సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు చేపల తాతయ్య, కే.సోమునాయుడు, కర్రి అప్పారావు, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు వద్ద సిపిఎం నేతలు

## జాతీయ వాలీబాల్ పోటీలకు డైట్ విదార్థిని ఎంపిక

**ప్రజాశక్తి-అనకాపల్లి**

అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు అనకాపల్లి డైట్ కళాశాల విద్యార్థిని ఎ.టాన్సీరాణి ఎంపికయ్యారు. డైట్‌లో సిఎస్‌ఇ చదువుతున్న టాన్సీరాణి ఇటీవల జేఎన్టీయూ జీవిలో జరిగిన వాలీబాల్ పోటీలలో తన ప్రతిభ కనపరచి ఈనెల 7, 8, 9 తేదీలలో చెన్నై జెఈపిపిఐఎఏఆర్ యూనివర్సిటీ జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బిసిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. టాన్సీరాణి ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ కె కృష్ణనాగు, డీన్ అడ్మిన్ డాక్టర్ కె ఈశ్వరరావు, అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

టాన్సీరాణి

## మంచినీటి సరఫరా పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని మూలపేట గ్రామానికి గత 15 రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మంచినీటి సరఫరా చేపట్టాలని గ్రామ అభివద్ధి కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ్, కో కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో నరసింహారావును కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి తాత్కాలికంగా వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పిజిఆర్‌ఎస్‌కు 211 అర్జీలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై 211 అర్జీలను అందజేసారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వైఎస్‌వికెజిఎస్‌ఎల్ సత్యనారాయణరావు, గృహనిర్మాణశాఖ ప్రోజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా, పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం

**ప్రజాశక్తి-యలమంచిలి :** యలమంచిలి మున్సిపాలిటీలో కుంటి నడకన నడుస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా ప్రజారోగ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, జల్ జీవన్ మిషన్, శానిటేషన్ పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుని సత్వర చర్యల కోసం ఆదేశించారు. అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. అందుకు ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాయలబాబు, ఇఇ సుగుణాకర్, మున్సిపల్ డిఇ మాధవ్ సుముఖత వ్యక్తం చేశారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-యలమంచిలి :** మండలంలోని రేగులపాలెంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ రాజాన మహాలక్ష్మి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. రేగుపాలెం ముస్లిములు సిసి రోడ్డు కోసం పలు పర్యాయాలు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన సర్పంచ్ గ్రామపంచాయతీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు బాషా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ టెక్నికల్ అసిస్టెంట్ స్టీఫెన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, శ్రీనివాస్

తరుణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-దేవరాపల్లి :** జాతీయస్థాయి ఖోఖో పోటీలకు తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి రొంగలి తరుణ్ ఎంపికయ్యాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈనెల 9 నుండి 13వ తేదీ వరకు జాతీయస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-14 బాల బాలికల ఖోఖో పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తెనుగుపూడి గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తరుణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.రఘు తెలిపారు. ఈ మేరకు తరుణ్‌కు ఉమ్మడి విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి డిసిఒ జి.గ్రేస్ శుభాకాంక్షలు తెలియజేశారు. తరుణ్‌ను, వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావులను ప్రిన్సిపాల్ రఘు, హౌస్ టీచర్ బీవీ రమణమూర్తి, ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్ ఇరటా నరసింహమూర్తి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## 11న కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్ష

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఈనెల 8న జరగవలసిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను వైకుంఠ ఏకాదశి, ఇతర శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జనవరి 11వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా (విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు) సంబంధించిన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు విశాఖపట్నం కైలాసగిరి వద్ద గల డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ మైదానానికి జనవరి 11వ తేదీన హాజరు కావాలని పేర్కొన్నారు. నోటిఫికేషన్ షెడ్యూల్ మేరకు జనవరి 8 తేదీ మినహా మిగిలిన తేదీల్లో దేహదారుఢ్య పరీక్షలు యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

## రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు క్రీడాకారులను సోమవారం అచ్యుతాపురం కైట్స్ విద్యా విహార్ పాఠశాలలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సెలక్షన్ కమిటీ జిల్లా కార్యదర్శి పైల ప్రవీణ్ మాట్లాడుతూ ఈనెల 16, 17, 18 తేదీలలో ప్రకాశం జిల్లా పొదిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు అనకాపల్లి జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. కైట్స్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, కైట్స్ విద్యా విహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్ మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమమైన ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రెడ్డి ప్రసన్న, డైరెక్టర్ రెడ్డి ప్రియాంక, పిడి శివాజీ పాల్గొన్నారు.

# ప్రధాని మోడీకి నిరసనలు తెలపండి

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

నినాదాలు చేస్తున్న గనిశెట్టి, కార్మికులు

**ప్రజాశక్తి-పరవాడ**

నక్కపల్లి బల్క్ డ్రగ్ పరిశ్రమల శంకుస్థాపనకు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపైనా ఈనెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి నిరసనలు తెలియజేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. పరవాడలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ మోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో తీవ్రమైన కాలుష్యంలో ప్రజలు అల్లాడుతున్నారని, మంచినీరికి, మంచి గాలికి, మంచి నేలకు జిల్లా ప్రజలు నోచుకోలేదని, ఇటువంటి పరిస్థితుల్లో నక్కపల్లి వద్ద కాలుష్య కారక బల్క్ డ్రగ్ పరిశ్రమలను స్థాపించడం దుర్మార్గమన్నారు. దేవరపల్లి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ స్థాపించి గిరిజనుల మనుగడను దెబ్బతీయొద్దని హితవుపలికారు. పూడిమడక ఎన్టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ స్థాపనలో నష్టపోతున్న నిర్వాసితులకు, మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. ముఠా, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమములో వి.రవి, పి.అప్పలరాజు, జి.శ్రీనివాసరావు, బి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, వి.దేవా, టి.పైడినాయుడు, టి.నాయుడు, కే.శవ, ఆర్.సర్వేశ్వరరావు, బొండా చిన్న పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేపై శ్వేత పత్రం విడుదల చేయాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వే పై జమా ఖర్చులతో సహా సమగ్రమైన వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పిఎస్ అజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం రీ సర్వేను కొనసాగించాలని నిర్ణయించినట్లు రెవిన్యూ మంత్రి ప్రకటించారని, ఆ నిర్ణయం వెనుక ఉన్న లక్ష్యాలు ఏమిటో ప్రజలకు తెలియజేయాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే, తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఎన్నికలలో పెద్ద ఎత్తున విమర్శ చేసిన టిడిపి, జనసేన పార్టీలు ఇప్పుడు తమ వైఖరిని ఎందుకు మార్చుకుంటున్నాయో, గత రీ సర్వేలో గుర్తించిన లోపాలు ఏమిటో ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన రీ సర్వేను సమీక్షించడానికి వీలుగా ఒక కమిటీని నియమించి అధ్యయనం చేయాలని, అందులో ప్రజలకు, ప్రజా సంఘాలకు, రైతు సంఘాలకు తమ అభిప్రాయాలను చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరారు.

## జిల్లాలో ఎస్‌సి కార్పొరేషన్ ఆఫీసు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించి నిరుపేదలకు దళితులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షులు బోని గణేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఓ సత్యనారాయణరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. నూతన జిల్లాగా అనకాపల్లి జిల్లాను ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు కావస్తున్నా విశాఖపట్నంలో సుమారుగా అన్ని శాఖలను తరలించినా నేటికీ ఎస్సీ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ తరలించకపోవడం బాధాకరమన్నారు. విశాఖపట్నంలో కార్యాలయానికి దూర ప్రాంతాల నుండి వెళ్లి పడిగాపులు కాస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మైలపల్లి పోతురాజు, ఉపాధ్యక్షులు కోనపల్లి సత్యనారాయణ, దళిత నాయకులు యర్రంశెట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు కేలండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో నూతన కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పోకూరి శ్రీనివాసరావు, పిఆర్‌టియు నాయకులు భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

- ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలి
- రాష్ట్ర మంత్రులు అనిత, నాదెండ్ల

సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, చిత్రంలో మంత్రి నాదెండ్ల, ఎంపీ రమేష్, కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 8న విశాఖ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి జిల్లాలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వారు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ బహిరంగ సభకు తీసుకెళ్లే ప్రతి ఒక్కరినీ తిరిగి సురక్షితంగా వారి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణపై ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఎంపీ సిఎం.రమేష్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లా నుండి 840 బస్సుల్లో 42వేల మందిని పంపించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి బస్సుకు ఇద్దరు బాధ్యులను నియమించామని చెప్పారు. బస్సులు గ్రామాల్లోకి ఉదయం 5 గంటలకు వెళ్తాయని, 9 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం ఒంటిగంటకు చేరేవిధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అల్పాహార ప్యాకెట్లు, భోజనం ఇవ్వడం జరుగుతుందన్నారు. సభ అనంతరం రాత్రి 8 గంటలకు బయలు దేరి 10 గంటలకు ప్రజలను వారి గ్రామాల్లో దింపేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మొత్తం ప్రక్రియను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుండి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్ బాబు, కెఎస్ఎన్ఎస్.రాజు, లోకం నాగమాధవి, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంటు కార్పొరేషను చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రోడ్డు డెవలప్మెంటు కార్పొరేషను చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, కొప్పులవెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, ఆర్‌డిఒలు షేక్ ఆయిషా, వివి రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మోడీ పర్యటనను విజయవంతం చేయాలి

అనకాపల్లి : ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రధాని మోడీ పర్యటనపై నియోజకవర్గ కూటమి ముఖ్యనాయకులతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-సబ్బవరం : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం అవుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని పైడివాడ, ఇరువాడ రెవెన్యూ గ్రామాలలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలపై పైడివాడలో 5 అర్జీలు, ఇరువాడలో 15 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పైడివాడ సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, ఎంపీటీసీ సిరం అప్పలరాజు, ఇరువాడ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కనకరాజు, మాజీ సర్పంచ్ బలిరెడ్డి అప్పారావు, వైస్ సర్పంచ్ బలిరెడ్డి సూర్య ప్రసాద్, రీ సర్వే డిటి ఎం.గణపతిరావు, ఆర్ఐ వీరయ్య, సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వోలు దేముడుబాబు, పి.జగన్నాథరావు, విలేజ్ సర్వేయర్ రాపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పంగిడి గ్రామంలో సోమవారం స్థానిక తహశీల్దార్ ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వికలాంగునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మునగపాక : విధి నిర్వహణలో విద్యుత్ స్తంభం నుండి జారిపడి 20 ఏళ్లగా మంచానికి పరిమితమైన మండలంలోని సిరసపల్లి గ్రామానికి చెందిన సీనియర్ లైన్మెన్ బొడ్డేడ గోవిందుకు సేవా వికాస్ సంస్థ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసింది. గోవిందు ట్రై సైకిల్ కోసం సేవా వికాస్ సంస్థను కోరిన పిమ్మట నగదును సంస్థ ప్రతినిధులు అతని నివాసంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైవాడలో గ్రామసభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ గ్రామంలో సర్పంచ్ చల్లా లక్ష్మీనాయుడు అధ్యక్షతన సోమవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చల్లా నానాజీ, చల్లా తాతయ్యలు, కూండ్రపు అప్పలనాయుడు, చల్లా నాయుడుబాబు, పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరుకు రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-దేవరాపల్లి : చెరుకు రైతుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వ్యవసాయ అధికారి (సిడిఓ) కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బోయిలకింతాడ చెరుకు కాటా వద్ద సోమవారం ప్రస్తుత క్రషింగ్ సీజన్‌కు చెరుకు రవాణా నిమిత్తం రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఉన్న వివిధ సమస్యలపైనా, చెరుకు బకాయిలు, రవాణా బకాయిలు, బీమా బకాయిలు తదితర వాటిపై చర్చించారు. ఈ అంశాలపై కృష్ణమూర్తి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూరె బాబురావు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరుకు అభివృద్ధి మండలి డైరెక్టర్ అన్నం రాము, నాయకులు కొప్పాక వెంకటరావు, అన్నం రామునాయుడు, కోమార బాబూరావు, కడిమి నాగేశ్వరరావు, దాసరి వెంకునాయుడు, కొప్పాక మాలిబాబు తదితరులు పాల్గొన్నారు

## తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపి అగ్రహారం గ్రామంలో గోపిశెట్టి వారి కల్లాలు వద్ద జిల్లాపరిషత్ నిధులతో నిర్మించిన మంచినీటి బోరు జెడ్పిటిసి దొండ రాంబాబు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఉప సర్పంచ్ దేవర మునిబాబు నాయుడు, మాజీ సర్పంచ్ దేవర రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ పి.గాంధీ పాల్గొన్నారు.

మంచినీటి బోరును ప్రారంభిస్తున్న జెడ్పిటిసి రాంబాబు

# విశాఖ డెయిరీని కాపాడుకోవాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రైవేటు డెయిరీలపై పోరాటం చేసి తల్లి లాంటి విజయ విశాఖ డెయిరీని కాపాడుకోవాల్సిన బాధ్యత పాడి రైతులపై ఉందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని చౌడువాడలో విశాఖ డెయిరీ పాడి రైతులకు సంక్రాంతి బోనస్‌ను సోమవారం అందించారు. డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ విశాఖ నగరానికి అత్యధికంగా కూరగాయలు సరఫరా కే.కోటపాడు మండలం నుంచే జరుగుతుందని, వీటిని మరింతగా పెంచడానికి అవసరమయ్యే సహకారం అందిస్తామని చెప్పారు. విశాఖ డెయిరీ వైస్ చైర్మన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ గేదెల పెంపకం చేపడితేనే అధిక ఆదాయం వస్తుందని, పాడి రైతులు ఆ దిశగా ఆసక్తి చూపాలని కోరారు. అనంతరం కె.కోటపాడు, దేవరాపల్లి, విజయనగరం జిల్లా వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాల రైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.5 కోట్ల 62 లక్షల 47 వేల 551ను ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు శీరంరెడ్డి సూర్యనారాయణ, కోళ్ల కాటమయ్య, దాడి పవన్ కుమార్, గేదెల సత్యనారాయణ, శంకర్రావు, డెయిరీ మేనేజర్ పాండ్య రాజన్, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పాల కేంద్రం అధ్యక్షులు కోమార వెంకటరమణ (పీర్‌లెస్), జనసేన పార్టీ నాయకులు కుంచ అంజిబాబు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఆవు సజీవ దహనం

### మరో ఆవుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో తలారి వెంకయమ్మ పశువులపాకకు ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో పాకపూర్తిగా దగ్ధం కాగా ఒక ఆవు సజీవ దహనమైంది. మరో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. ప్రమాదం గురించి తెలుసుకున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, డెయిరీ డైరెక్టర్లు పిళ్లా రమాకుమారి, సుందరపు గంగాధర్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు విశాఖ డెయిరీ తరపున ఆర్థిక సాయంగా రూ.10వేలు చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగలి మహేష్, క్లస్టర్ ఇంచార్జి కన్నూరు సూర్యనారాయణ, నాయకులు కొట్యాడ నారాయణమూర్తి, జనసేన నాయకులు కుంచా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 1200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కె.కోటపాడు : అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సోమవారం మండలంలోని కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. మండలంలోని కొరువాడ గ్రామంలో 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. గవరపాలెం గ్రామ పొలిమేరలో 400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో చోడవరం ఎక్సైజ్ సిఐ కెవిపి నాయుడు, అనకాపల్లి ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ చెందిన ఎన్ శ్రీనివాసరావు, విజయనగరం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ రాజశేఖర్ నాయుడు, కొత్తవలస ఎక్సైజ్ సిఐ కుమార్ ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గెడ్డవాగు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని గొల్లలపాలెం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 120లో ప్రభుత్వ గెడ్డవాగు ఆక్రమణపై పలువురు గ్రామస్తులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు, మండల తహశీల్దారుకు, ఇరిగేషన్ ఎఈకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 120లో 10.63 ఎకరాల 63 సెంట్లు ప్రభుత్వ గెడ్డ వాగును ఇటీవల గ్రామానికి చెందిన కొంతమంది పెత్తందారులు ఆక్రమణ చేసి తుప్పలు తొలగించి, దానిని పూడ్చే పనులు చేపట్టారని తెలిపారు. గతంలో జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో ఈ వాగులో ఉన్న బందను అభివృద్ధి చేశారని, ఈ వాగు నుండి వర్షాకాలంలో బొబ్బిలి చెరువుకు, రాజు చెరువుకు నీరు ప్రవహిస్తుందని పేర్కొన్నారు. ఈ వాగు ద్వారా పంట పొలాలకు సాగునీరు అందడంతో పాటు పశువులకు, మేకలకు, గొర్రెలకు, పక్షులకు తాగునీరు అందుతుందని చెప్పారు. పెత్తందారులు ఈ గెడ్డ వాగును కప్పి వేసి సాగు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల చుట్టుపక్కల ఉన్న రైతులు తమకు సాగునీరు అందే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారని, రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి సర్వే నెంబర్ 120లో సరిహద్దులు గుర్తించి ప్రభుత్వం ఆక్రమణ గెడ్డవాగు భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : కీర్తిశేషులు డబ్బూరు సన్యాసయ్య, అప్పలనరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారు కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సన్యాసయ్య పెద్ద కుమారుడు కన్నయ్య, రమణమ్మ దంపతులు, దేవరాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి పూజ్య మేఘన, హెచ్ఎం బి.అప్పల రాము, హెచ్ఎస్ పుష్పరాజు, హెచ్‌వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం రెవెన్యూ పరిధి ఆక్రమణ స్థలంలో తహసీల్దార్ ఆదేశాలతో సోమవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రాజాం సర్వే నెంబర్ 328లో సుమారు 7ఎకరాలు బంజరు భూమి ఉంది. ఈ భూమిలో అనధికారికంగా కొంతమంది ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని ఆక్రమించారు. దీనిపై రాజాంకు చెందిన పలువురు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు స్థలంలో హెచ్చరిక బోర్డును వీఆర్ఏలు సోమవారం ఏర్పాటు చేశారు.

## విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అంధుల దినోత్సవం, లూయిస్ బ్రెయిలీ జయంతిని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు పర్యవేక్షణలోస్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బొడ్డు మహాలక్ష్మి నాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడుల ఆధ్వర్యంలో సహిత విద్యలో భాగంగా అంధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగులు పందెం, ఖోఖో, డ్రాయింగ్, వ్యాసరచన ఇతర పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు అందజేశారు. కార్యక్రమంలో మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు , భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథ నాయుడు , మేడివాడ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు గోవిందరావు, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు నాగమణి పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు నిత్యావసర సరుకులు, వస్త్రాలు పంపిణీ చేశారు. జోన్ క్లబ్‌ల ఏర్పాటులో భాగంగా కుసుమంచి వెంకటకృష్ణ ఇంటి వద్ద వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బలిఘట్టం, యూత్ ఏటిగైరంపేట, కపుల్స్ రావికమతం, మేడివాడ రావికమతం జోన్ క్లబ్బులను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్బులకు నియమించిన ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్లతో గోల్డెన్ కెసిఐఎఫ్ క్లబ్ గవర్నర్ కొల్లూరు పార్వతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ క్లబ్ పెద్దలు వర్గ విభేదాలు లేకుండా స్నేహం, సేవ పరమార్థంగా సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ సత్యనారాయణ, రీజన్ చైర్పర్సన్ వెంకటకృష్ణ, చెన్న హరికృష్ణ, శీరం లక్ష్మణరావు పాల్గొన్నారు.

## వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో రోగులకు వైద్యసేవల్లో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు తెలిపారు.ఆసుపత్రికి వచ్చే రోగులను ఇక్కడి వైద్యులు, సిబ్బంది ప్రయివేటుకు రిఫరల్ చేస్తున్నారని ఆరోపించారు.

కొందరు వైద్యులకు సొంతంగా క్లినిక్‌లు ఉండడం వల్ల దూరాభారం నుంచి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులకు సరైన సేవలు అందించకుండా, ప్రయివేటుకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా గర్భిణుల మరణానికి కొందరి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని, దీనిపై తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ్మోహన్ సత్యనారాయణ గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ధనలక్ష్మి

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని పిహెచ్‌సి వైద్యాధికారిణి ధనలక్ష్మి సూచించారు. సోమవారం లింగాపురం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా 72 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం చలికాలం కావడంతో పలు వ్యాధులు వచ్చే అవకాశంఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీళ్ల తాగడంతో పాటు శీతల గాలులకు రక్షణగా దుస్తులు ధరించాలని సూచించారు, కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పి వదిలేశారు..!

• పైపులైన్ గోతుల పూడ్చడంలో నిర్లక్ష్యం • అవస్థలు పడుతున్న ప్రజలు

అరకొరగా పూడ్చి వదిలేసిన పైపులైను గోతులు

ప్రజాశక్తి- మాడుగుల :ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షన్లు అందించేందుకు పైపులైన్ల ఏర్పాటుకు తవ్విన గోతులు అరకొరగా పూడ్చి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో భాగంగా సంబంధిత గుత్తేదారుడు కొత్తగా వేసిన రోడ్డును ఇష్టానుసారం తవ్వేసి, పైపులైను వేసిన తర్వాత యథావిధిగా పూడ్చకుంటే, పైపైనే మట్టిని కప్పేసి వదిలేశారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి పైపులైను గోతులను పూడ్చిన మట్టికాస్త కుంగిపోవడంతో ఎక్కడికక్కడే గోతులుగా, బాటలుగా ఏర్పడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో తీసిన గోతులను పూడ్చలేనప్పటికీ, కొత్తగా మాడుగుల దేవి ఆడిటోరియం నుండి సాగరం వెళ్లే సీసీ రోడ్డు మధ్యలో ఇష్టానుసారంగా డ్రిల్లింగ్ చేసి గోతులు తవ్వేసి పైపులైను వేసిన కాంట్రాక్టర్లు, గతంలోలాగనే వదిలేసారు. సంబంధిత అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడం, నిర్లక్ష్యపూరిత వైఖరి వల్లే ప్రజలు కష్టాలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని తవ్విన గోతులను మునుపటిలా పటిష్టం చేయాలని కోరుతున్నారు.లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## హోంమంత్రి అనితపై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి - నక్కపల్లి : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపణలు చేయడం తగదని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ హోంమంత్రి అనిత ప్రైవేటు పిఏపై ఆరోపణ రాగానే తొలగించారన్నారు. తిరుమల లెటర్స్ పై ఆరోపణలు మాత్రమే వచ్చాయని, ఎక్కడ రుజువు కాలేదన్నారు. అయినప్పటికీ హోంమంత్రి అనిత ప్రైవేట్ పిఎను తొలగించారన్నారు. దానికి మంత్రి అనితకు ఆపాదిస్తూ ఆమెపై గానీ, ఇతర నాయకత్వంపై గాని ఆరోపణ చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

## మోదమ్మకు వెండి వితరణ

ప్రజాశక్తి- మాడుగుల :మండలంలోని ఎం కోడూరు. మోదకొండమ్మ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన శాఖ సత్యనారాయణ, లక్ష్మి దంపతుల కుమారులు శ్రీనివాస్, ఆశ్రిత, నానాజీ దేవి ప్రసన్న, విశ్వేశ్వర్ అనురాధ దంపతులు పావు కిలో వెండిని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు సోమవారం విరాళంగా అందజేశారు కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, జల్లి హరిప్రసాద్, బంగారుమెట్ట నాగేశ్వరావు, అప్పాన నాయుడు,జొన్నపల్లి నాగరాజు, ముమ్మిన రవణ బాబు,గెంజి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

# పద్యపఠనం విజేతకు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కాశింశెట్టి నందినీలక్ష్మి శతక పద్య పఠనం పోటీల్లో విజేతగా నిలిచింది. సోమవారం పాఠశాలలో హెచ్ఎం బి.కవిత, గ్రంథాలయ అధికారి జనార్దన్, ఉపాధ్యాయులు లక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కవిత మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ నెలలో అనర్గల శతక పద్యపఠనం సీనియర్స్ విభాగంలో జూమ్‌లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పోటీలలో కాశింశెట్టి నందినీలక్ష్మి ప్రతిభ కనబరిచి ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. .పద్యగురు సార్వభౌమ, పండితుడు తోపెళ్ల బాల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో లక్ష్మి విజేతగా నిలిచిందన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సహకారంతో కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని10వ వార్డు కౌన్సిలర్ గుడివాడ రాజులు నాయుడు తెలిపారు. సోమవారం పెద్దబొడ్డేపల్లిలో రూ. 3.50లక్షల నిధులతో డ్రాయింగ్ మాస్టర్ ఇంటివద్ద కల్వర్టు, డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రెడ్డి అప్పలనాయుడు , 13వ వార్డ్ ఇన్చార్జ్ చిటికెల కన్నయ్యనాయుడు 11వ వార్డ్ ఇన్చార్జ్ రెడ్డి రాజబాబు ,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదభరితంగా ఉన్నా పట్టించుకోరా..?

• పలు గ్రామాల్లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, వైర్లు

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి, పడిపోయే స్థితిలో ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని కింతలి, గొట్టివాడ అగ్రహారం, పోతనపూడి అగ్రహారం గ్రామాల్లో పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు కిందకు వాలి పడి పోయే స్థితిలో ఉండడంతో పొలాల్లో పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు, ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి , ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కింతలి ప్రధాన రహదారి పక్కన ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం

## సర్వీస్ ప్రొవైడర్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీలో ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ఏసి, రిఫ్రిజిరేటర్, , గీజర్లు, టి.వి.లు, వాషింగ్ మెషిన్లు మొదలైన గృహోపకరణాల మరమ్మతులతోపాటు బ్యుటీషియన్ (మెన్ అండ్ ఉమెన్)గా శిక్షణలో సర్వీసు ప్రొవైడర్లు నియమకానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. . పట్టణ పేదరిక నిర్మూలన మెప్మా కార్యక్రమాల్లో భాగంగా ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పట్టణంలో వివిధ చేతివృత్తుల మీద ఆధారపడి పనిచేస్తున్న వ్యక్తులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించుటకు, వారి సేవలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంచుటకు సర్వీసు ప్రొవైడర్ నియామకానికి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా నర్సీపట్నంలోని పెదబొడ్డేపల్లి మెప్మా కార్యాలయములో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## ఈ విద్యా సంవత్సరం నుంచే 'తల్లికి వందనం' అమలు చేయాలి

ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలనే ఆలోచన సరికాదని, ఇప్పటికే ఎంతోమంది పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అందరికీ ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి విద్యార్థులకు అన్యాయం చేయడం సరి కాదన్నారు. ప్రభుత్వం తాజా ప్రకటనను వెనక్కు తీసుకుని, ఈ విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. అలాగే పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కిరణ్, హర్షిత, శశి,రాజు, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- కోటవురట్ల: రీసర్వే సమస్యలపై నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా, మళ్లీ ఇపుడు అదే సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రయోజనమేంటని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం లింగాపురం గ్రామంలో ఆర్ఐ ఊర్దవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై అధికారులను పలువురు రైతులు నిలదీశారు, ప్రసాదుల బాబురావు అనే రైతు తనకున్న ఎకరంన్నర భూమికి గాను కేవలం 12 సెంట్లు మాత్రమే పాస్ బుక్‌లోకి ఎక్కించి పట్టా పుస్తకం ఇచ్చారని మిగతా భూమి గురించి ఎన్నిసార్లు అధికారులు అడిగిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు, తన భూమిని రీసర్వే కూడా పైల రాజు నాయుడు అనే వ్యక్తి అధికారులను ప్రశ్నించారు. గ్రామసభలో 8 ఫిర్యాదులు అందాయని రెవెన్యూ అధికారులు తెలిపారు, కార్యక్రమంలో టిడిపి నాయకులు నారాయణ మూర్తి, వైసిపి నాయకులు రమణ, విఆర్ఓ సంఘ నాయకులు రమేష్, మండల సర్వేయర్ శ్రీనివాస్, విఆర్ఓ సతీష్ పాల్గొన్నారు.

**రావికమతం:** మండలంలో కవగుంట, బుడ్డి బంద గ్రామాలలో సోమవారం రెవెన్యూ సదస్సులను సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆధ్వర్యంలో నిర్వహించారు .కవగుంట, బుడ్డి బంద రెండు గ్రామాలలోనూ సుమారు 32 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసిల్దారు అప్పలనాయుడు, మండల సర్వేయర్ సురేష్, విఆర్ఓ కమల ,మూర్తి, సచివాలయ సర్వేయర్ హరి, వీఆర్ఏ శ్రీను, ఎక్స్ ఎంపీటీసీ గుళ్ళ వరహాలు దొర, కిముడు వరహాలు, రొబ్బా వీరభద్ర రాజు పాల్గొన్నారు.

## సమన్వయంతో ముందుకెళ్లండి

మాట్లాడుతున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత

**ప్రజాశక్తి-నక్కపల్లి** : ఈనెల 8 వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం నక్కపల్లిలోని తన స్వగృహంలో పాయకరావుపేట నియోజకవర్గం కూటమి నేతలు, అధికారులతో సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నక్కపల్లి లో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారన్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు,డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఐదేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గంలో ఒక్క కంపెనీ కూడా రాలేదన్నారు. కనీసం పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా క్లీయర్ చేయలేదన్నారు. ఇపుడు బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ రాబోతున్నాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ,అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్** : ఈ వెల 8న ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజన వీరసూర్యచంద్ర కోరారు.. సోమవారం నర్సీపట్నంలో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనకు ప్రధాని వస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం ఎస్‌సి సెల్ కన్వీనర్ డాక్టర్ కోవా నారాయణరావు, ఉమ్మడి జిల్లా పార్టీ సంయుక్త కార్యదర్శి నమ్మి రమణరాజు ప్రోగాం కమిటీ నాయకుల పినపోతుల నాగు, బోయిన చిరంజీవి, రమణ, ప్రసాద్, రాజు, కర్రి సురేష్, రమణ, కర్రి సురేష్ పాల్గొన్నారు.

# బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటే.. వద్దు..!

- శంకుస్థాపన యోచన ప్రధాన మోడీ విరమించుకోవాలి
- మండల రెవెన్యూ కార్యాలయం వద్ద అఖిలపక్షం ధర్నా
- తహశీల్దార్‌కు వినతిపత్రం అందించిన నిర్వాసితులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

**ప్రజాశక్తి- నక్కపల్లి** : పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయవద్దని, ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు.

నక్కపల్లి మండలంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా రాజయ్యపేట ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద అఖిలపక్ష పార్టీల నేతలతో కలిసి కారిడార్ నిర్వాసితులు బైఠాయించి, ధర్నా చేపట్టారు. బల్క్ డ్రగ్ పార్క్ వద్దే వద్దని, ప్రధాని శంకుస్థాపన విరమించుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తహసిల్దార్ నరసింహామూర్తికి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్యావరణానికి ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కును విదేశాల్లోనూ, కాకినాడ సెజ్ ప్రజానీకం వ్యతిరేకిస్తే, ఆ పరిశ్రమను రాజయ్యపేట ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని, ఇక్కడ ప్రజలను కష్టాలను గురిచేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. విశాఖపట్నం లో ఈనెల 8న బల్క్ డ్రగ్ పార్క్ వర్చువల్ శంకుస్థాపనను ప్రధానమంత్రి మోడీ విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు, నాయకులు

ప్రభుత్వం లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని, వేల మందికి ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పెద్ద ఎత్తున గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని, ఇది అంతా ఒట్టిబూటకమన్నారు. పేద రైతులు భూములు కార్పోరేట్ కంపెనీలకు కారు చౌకగా అప్పగించారని, దీనినే ప్రభుత్వం అభివృద్ధి అంటుందని, ఇరవై వేల ఉద్యోగాలు వస్తాయని ప్రచారం చేస్తున్నారన్నారు. పరిశ్రమల స్థాపన కోసం భూములు సేకరించిన గ్రామాల్లో రైతులు, కూలీలు, దళితులు, చేతివృత్తిదారులు, మత్స్యకారులు ముప్పై ఐదు వేల మంది ప్రజలు జీవిస్తున్నారని, స్థానికేతరులకు ఇరవై వేల మందికి ఉద్యోగాలు పేరు చెప్పి ముప్పై ఐదు వేల మంది నిర్వాసితులకు ఉపాధి లేకుండా చేయడం ఎలా అభివృద్ధి అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇల్లు కోల్పోతున్న వారికి రూ.25 లక్షలు, ఉపాధి కోల్పోయి ఇక్కడ ఏర్పాటు చేయబోయే కంపెనీల యొక్క ప్రభావానికి గురయ్యే వారికి రూ.15 లక్షలు ప్యాకేజీలు చెల్లించాలి, నిర్వాసితులు కోరుకున్న చోట పునరావాసం, మెరుగైన సౌకర్యాలు కల్పించాలి, సాగు భూములకు, డి ఫారం ,సాగు భూముల్లో ఉన్న చెట్లకు నష్ట పరిహారం చెల్లించాలని, రాజయ్యపేట, బోయపాడు, అమలాపురం మత్స్యకార సొసైటీ భూములకు, చందనాడ దళితుల డీఫారం భూములకు, గుల్లబట్టిల భూములకు నష్ట పరిహారం చెల్లించాలని, పూర్తిస్థాయిలో నిర్వాసితులకు ప్రతి సెంటుకు, ప్రతి చెట్టుకు నష్టపరిహారం చెల్లించాలని ,ప్రతీ నిర్వాసితుకు ప్యాకేజీ చెల్లించాలని అప్పటి వరకు ఎటువంటి శంకుస్థాపనలు, పనులు చేపట్టవద్ధని కోరారు. ప్రధాని బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన విరమించుకోకపోతే అడ్డుకుంటామని నాయకులు స్పష్టం చేశారు.ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చందనాడ ఎంపిటిసి గంటా తిరుపతిరావు, సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, రావి అప్పారావు, పద్మ, గోసల సోమేశ్వరరావు,కాలే భూలోక, తళ్ళ భార్గవ్, అప్పలస్వామి, వైసిపి నేతలు సురకాసుల గోవింద్, పాల్గొన్నారు,

## ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజనం

### ఆనందం వ్యక్తం చేస్తున్న ఇంటర్ విద్యార్థులు

కాలేజీ గ్రౌండ్‌లో భోజనాలు చేస్తున్న ఇంటర్ విద్యార్థులు

**ప్రజాశక్తి కోటవురట్ల** : కూటమి ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మపేరిట ఇటీవల ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం అమలు పట్ల హర్షం వ్యక్తమౌతోంది. సోమవారం ఎంఇఒ రామారావు, ఎంఇఒ-2 జోష్, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, పథకం అమలు తీరు మధ్యాన్న భోజనం నాణ్యతను పరిశీలించారు, స్థానిక కాలేజీలో 270 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు, వివిధ గ్రామాల నుంచి ఉదయం కళాశాలకు వచ్చే సమయంలో మధ్యాహ్నం భోజనం తీసుకుని వచ్చేందుకు ఇబ్బందులు పడే వారమని, ప్రస్తుతం అమలవుతున్న పథకం ప్రశాంతంగా చదువుకునే అవకాశం ఉన్నట్లు విద్యార్థులు అంటున్నారు. సోమవారం 230 మంది వరకు ఇంటర్ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. కళాశాల భోజనశాల చిన్నది కావడంతో విద్యార్థులు ఆరుబయట భోంచేయాల్సిన చేయవలసిన పరిస్థితి నెలకొంది, కొంతమంది విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకొని భోంచేస్తున్న దశ్యం కూడా దర్శనమిచ్చింది, అధికారులు నాణ్యమైన భోజనంతోపాటు వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుకుంటున్నారు.

# పింఛను మంజూరు చేయరూ..!

### వితంతువుల వేడుకోలు

దరఖాస్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న వితంతువులు

**ప్రజాశక్తి - చీడికాడ** : తమకు పింఛన్లు మంజూరుచేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల నుంచి వితంతువులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వైసిపి మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, ఎంపిపి కురచా జయమ్మ ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతిపత్రం అ ందజేశారు. మండలంలో పలు గ్రామాల నుంచి ఇటీవల భర్తలను కోల్పోయిన వితంతువులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి తమకు పింఛను ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవల పింఛన్లు పంపిణీలో వితంతువులకు నెలరోజుల్లోనే పింఛను ఇస్తామంటూ కూటమి నేతలు గొప్పగా చెప్పారని, తాము నెలల తరబడి దరఖాస్తు చేసుకుని పింఛను కోసం ఎదురుచూస్తున్నా మంజూరు చేయడం లేదని వారంతా వాపోయారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు గడిచిన కూడా తమకు వితంతు పెన్షన్ మంజూరు చేయకపోవడం బాధాకరంగా ఉందన్నారు. కుటుంబ పెద్ద మరణించాక పోషణ కష్టంగా ఉందని, కూటమి ప్రభుత్వం వెంటనే వితంతువు పెన్షన్లు ఇచ్చి ఆదుకో వాలని వేడుకున్నారు. మండలం లోని వివిధ గ్రామాల నుండి 200 మంది వరకు వితంతువులు మొరపెట్టుకున్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాశక్తి - రావికమతం**: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల వారీగా ఆయా గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశమై, గ్రామాభివృద్ధికి, ప్రధానమైన సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.. సమస్య తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారితో మాట్లాడి, అధికారులను ఆదేశించా మన్నారు..ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నడుచుకోవాలన్నారు. అనంతరం ఎపి తెలుగు నాడు వైద్య,ఆరోగ్య ఉద్యోగుల సంఘం కేలెండర్‌ను ఎమ్మెల్యే రాజు ఆవిష్కరించారు. ఉద్యోగులందరూ ఐక్యమత్యంతో ఉండి ప్రభుత్వానికి ,ప్రజలకు వారధిగా పనిచేసి మంచి పేరు తీసుకురావా లన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజాన నాయుడు, ఎంపిడిఒ వెంకన్న బాబు, ఎఒ రూప, పలుశాఖల ఇంజినీరింగ్ అధికారులు, సతీష్ పాల్గొన్నారు.

# దౌర్జన్యంగా భూమిని లాక్కొన్నారు..

### ఉరి తాడుతో గిరిజనుల వినూత్న నిరసన - రెవెన్యూ సదస్సులో ఆదివాసీల ఆందోళన

మెడలో ఉరితాడుతో నిరసన చేస్తున్న గిరిజనులు

**ప్రజాశక్తి -కొత్తకోట** : గిరిజన రైతుల భూముల్ని స్థానికేతరులు దౌర్జన్యంగా దున్నేస్తున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో రావికమతం మండలం కవ్వగుంట గ్రామంలో వినూత్నంగా మెడకు ఉరి తాడులు బిగించు కొని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండల ఉప తహసీల్దార్, గ్రామ విఆర్ఒ కమలమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు రోబ్బ వరహాలమ్మ, శంకరరావు,వరహాలు తదితరులు మాట్లాడుతూ కవ్వగుంట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 61-1, 64-1లలో గయాలు భూముల్లో స్థానికేతరులైన అల్లాడి శివరావు తన కుటుంబ సభ్యుల పేరిట సుమారు పదెకరాలకు పైగా జగనన్న రీ సర్వేలో పట్టాలిప్పించు కున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఈ భూముల్లో గిరిజనులే సాగులో ఉన్నారని, పలుకు బడి ఉపయోగించు కొని తమ భూమిపైనే పట్టాలు పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడంతో అప్పటి వి ఆర్ వో ను బదిలీ చేయడం తోపాటు ఆర్ఐకి నోటిస్ జారీ చేసారన్నారు. ఇప్పుడు అదే భూముల్ని దౌర్జన్యంగా సాగు చేస్తూన్నారని గిరిజనులు వాపోయారు.. తమకు న్యాయం జరగకపోతే ఉరి తాడే గతిని నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి మా భూములు మాకు అప్పగించాలాని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 20న మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మరోమారు ఉరితాళ్లతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.